సాక్షి ఖమ్మం

గురువారం । 27 । జూన్ । 2024



వ్యాయామం అవసరమే..

పిల్లలకు చదువుతో పాటు వ్యాయాయమూ అవసరమైనందున ఆ దిశగా తీర్చిదిద్దాలని అదనపు కలెక్టర్ మధుసూదన్ సూచించారు. 8లో



మామిడి.. రుమాడీ !

తమిళనాడులో పండే రుమాడీ రకం మామిడిని జిల్లా వ్యాపారులు దిగుమతి చేసుకుని విక్రయిస్తున్నారు. 8లో

గరిష్టం / కనిష్టం
30° / 25°

వాతావరణం

జిల్లాలో గురువారం ఉష్ణోగ్రతలు తక్కువగానే నమోదవుతాయి. పలుచోట్ల వర్షం కురిసే అవకాశముంది.



పెనుబల్లి మండలం లంకాసాగర్ క్రాస్ - ముత్తగూడెం మధ్య నిలిచిన రహదారి పనులు



బోనకల్ మండలం ముష్టికుంట్ల - చొప్పకట్లపాలెం మార్గంలో తేలిన కంకర



కారేపల్లి నుంచి మాదారం వెళ్లే రహదారి..



కల్లూరు మండలం లింగాల - ఎర్రబోయినపల్లి మధ్య పగుళ్లు



బోనకల్ మండలం చిన్నబీరవెల్లి - రాపల్లి మధ్య రహదారి పరిస్థితి ఇదీ..



కూసుమంచి మండలం పాలేరు - మల్లాయిగూడెం మార్గంలో దెబ్బతిన్న రోడ్డు

కూసాలు కదులుతున్నాయ్..



ఇది వైరా మండలం పాలడుగు - వల్లాపురం మధ్య ఉన్న ఆర్అండ్బీ రోడ్డు. ఇక్కడ కల్వర్టు రెండేళ్ల క్రితం కురిసిన భారీ వర్షానికి ఓవైపు కూలింది. అలాగే రోడ్డు మొత్తం అధ్వానంగా మారడంతో ప్రయాణికులు ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు.

సాక్షి ఫోకస్



ఎర్రుపాలెం నుంచి మధిర వెళ్లే మార్గంలో రోడ్డు దుస్థితి ఇది. దగ్గరకు వచ్చే వరకు గుంతలు కనిపించకపోవడంతో ద్విచక్ర వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు.

జిల్లాలో పలుచోట్ల గుల్లగా మారిన రహదారులు

- దెబ్బతిన్న రోడ్లపై ప్రయాణంతో అవస్థలు
- పలుచోట్ల ఏళ్ల తరబడి ప్యాచ్ వర్క్‌లతోనే సరి
- 320 కి.మీ. మేర మరమ్మతులకు రూ.119 కోట్లు అవసరమని అంచనాలు
- నిధులపై ప్రభుత్వానికి ఆర్అండ్బీ శాఖ ప్రతిపాదనలు

సాక్షి ప్రతినిధి, ఖమ్మం: జిల్లాలోని పలుమార్గాల్లో ఆర్అండ్బీ రహదారులు గుంతలమయంగా మారాయి. ఈ రోడ్లపై ప్రయాణం చేయాలంటే వాహనదారులకు తిప్పలు తప్పడం లేదు. తరచుగా ఈ రోడ్ల మీదుగా వెళ్లొచ్చే వారి వాహనాలు దెబ్బతినడమే కాక వెన్నునొప్పి, ఇతర అనారోగ్య సమస్యలు ఎదురవుతున్నాయని వాపోతున్నారు. జిల్లాలోని పలు ప్రాంతాల్లో మండల కేంద్రాల నుంచి ఇతర ప్రాంతాలకు వెళ్లే రోడ్లు తీవ్రంగా దెబ్బతినగా.. ఏళ్లుగా మరమ్మతులు చేపట్టకపోవడంతో మరింత అధ్వాన స్థితికి చేరాయి. ఇలా దెబ్బతిన్న రహదారులను మరమ్మతు చేయాలని ఇటీవల ప్రభుత్వం నిర్ణయించింది. దీంతో జిల్లాలో 320 కి.మీ. మేర దెబ్బతిన్న రహదారులను సరిచేసేందుకు రూ.119 కోట్ల నిధులు అవసరమని రహదారులు, భవనాల శాఖ అధికారులు నివేదిక సమర్పించారు. అయితే, నిధులు మంజూరై పూర్తిస్థాయిలో వర్షాలు కురవక ముందే మరమ్మతులు చేపట్టకపోతే రహదారులు మరింత దెబ్బతినే ఆస్కారముందని చెబుతున్నారు.

అతుకులతో నెట్టుకొస్తూ..

గత కొన్నేళ్లుగా జిల్లాలో బీటీ రోడ్లు మరమ్మతుకు నోచుకోలేదు. రెండేళ్లుగా కురుస్తున్న వర్షాలతో కల్వర్టులు కుంగడంతోపాటు చాలా చోట్ల రోడ్లు దెబ్బతిన్నాయి. కామేపల్లి మండలం పొన్నెకల్‌లో డబుల్‌రోడ్డు నిర్మించేందుకు సింగిల్ రోడ్డును తొలగించి పదేళ్లయినా పట్టించుకోకపోవడంతో ప్రయాణం నరకప్రాయంగా మారుతోంది. ఇదే తరహా పరిస్థితి చాలాచోట్ల ఉండగా.. ఐదేళ్ల నుంచి రెండేళ్ల మధ్యలోనే దెబ్బతిన్న రోడ్లు ఉన్నాయి. అయినా అధికారులు ప్యాచ్ వర్క్‌లతోనే మమ అనిపిస్తుండడంతో భారీ వాహనాలు వెళ్లినా, చిన్నపాటి వర్షం కురిసినా మళ్లీ పూర్వస్థితికి చేరుతోంది.

అంతర్గత రహదారులదీ అదేతీరు..

జిల్లాలో బీటీ రోడ్ల పరిస్థితి ఇలా ఉంటే.. గ్రామాల్లోని అంతర్గత రహదారుల పరిస్థితి మరీ అధ్వానంగా మారింది. ఈ రహదారులపై మట్టి, ఇసుక, కంకర తేలగా ప్రయాణించడానికి విన్యాసాలు చేయాల్సి వస్తోందని వాహనదారులు వాపోతున్నారు. బోనకల్ మండలం ముష్టికుంట్ల నుంచి చొప్పకట్లపాలెం వెళ్లే రహదారి కంకర తేలి ఉంది. చిన్న బీరవెల్లి నుంచి రాపల్లి వరకు రోడ్డు అధ్వానంగా ఉంది. ఇలా చాలాచోట్ల గుంతలు ఉండటంతో ప్రమాదాలు నిత్యకృత్యమయ్యాయి. ఈనేపథ్యాన బీటీ రోడ్లతోపాటు అంతర్గత రోడ్లకు కూడా మరమ్మతులు నిర్వహించాల్సిన అవసరం ఏర్పడింది.



కామేపల్లి మండలం తాళ్లగూడెం-పింజరమడుగు మధ్య టేకులతండా సమీపాన దెబ్బతిన్న రోడ్డు



కొణిజర్ల మండలం గుబ్బగుర్తి వద్ద రోడ్డు దుస్థితి

ఈ రోడ్లపై కష్టమే..

- ఏన్కూరు నుంచి ముచ్చర్ల వెళ్లే రోడ్డుపై తూతుకలింగన్నపేట వద్ద రోడ్డు గుంతలమయంగా మారింది. ఇక్కడి చెరువు పొంగినప్పుడల్లా రోడ్డు కొట్టుకుపోయిగుంతలు పడుతున్నాయి.
- కల్లూరు మండలంలోని లింగాల నుంచి ఎర్రబోయినపల్లి వరకు నిర్మించిన బీటీ రోడ్డు మధ్యలో పగుళ్లు ఏర్పడ్డాయి.
- కారేపల్లి - మాదారం, కారేపల్లి క్రాస్ రోడ్డు - సీతారాంపురం వరకు ఆర్అండ్బీ రోడ్లు దెబ్బతిన్నాయి.
- కామేపల్లి మండలంలోని ముచ్చర్ల -మద్దులపల్లి రహదారి గుంతలతో దర్శనమిస్తోంది. ఇదే మండలంలోని ఖమ్మం - ఇల్లెందు ప్రధాన రహదారి లింగాల క్రాస్ - మద్రిగూడెం వరకు దెబ్బతిన్నది. తాళ్లగూడెం - పింజరమడుగు, పింజర మడుగు - పాతలింగాల రోడ్ల పరిస్థితి అధ్వానంగా మారింది. పొన్నేకల్‌లో ఉన్న సింగిల్ బీటీ రోడ్డును తీసి డబుల్ రోడ్డు వేస్తామని ఉన్న రోడ్డు తీసేసి పదేళ్లుగా వదిలేశారు.
- కొణిజర్ల మండలం పల్లిపాడు నుంచి ఏన్కూరు మండల కేంద్రాన్ని కలుపుతూ వేసిన రోడ్డు గుంతలమయంగా మారింది. 2018లో నిర్మించిన ఈ రోడ్డు ఖమ్మం - భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల మధ్య దూరాన్ని తగ్గిస్తుంది. ఈ రహదారి పలుమార్లు ధ్వంసమైనా నామమాత్రపు మరమ్మతులతో సరిపెడుతున్నారు. ఇదే మండలం గుబ్బగుర్తి నుంచి అంజనాపురం మీదుగా ఏన్కూరు మండలం జన్నారం వరకు రోడ్డు దెబ్బతినగా, గుబ్బగుర్తి వద్ద రోడ్డు గతుకుల మయమైంది. అక్కడ కల్వర్టు అసంపూర్తిగా ఉండి కూలిపోగా ఆర్అండ్బీ అధికారులు తాత్కాలికంగా పైప్ వేసి పూడ్చారు. అయినా రోడ్డు కుంగి పోయి ద్విచక్రవాహనదారులు ప్రమాదాల బారినపడుతున్నారు. వారం క్రితం అంజనాపురానికి చెందిన ఓ యువకుడు గాయపడ్డాడు.
- పెనుబల్లి మండలం లంకాసాగర్ క్రాస్ నుంచి ముత్తగూడెం వరకు ఉన్న ఆర్అండ్బీ రోడ్డు గుంతలమయంగా ఉంది. మరమ్మతు పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్‌కు బిల్లు రాలేదంటూ మధ్యలో వదిలేశాడు.
- ఇవికాక తల్లాడ సమీపాన కల్లూరు వెళ్లే మార్గంలో, వేంసూరు మండలంలోని మర్లపాడు- కందుకూరు మధ్య, ముదిగొండ మండలంలోని న్యూలక్ష్మీపురం వద్ద రహదారులు దెబ్బతిన్నాయి. ఇక చింతకాని మండలంలో ఖమ్మం - బోనకల్ ప్రధాన రహదారిపై గుంతలు పడటంతో రూ.6 కోట్ల వ్యయంతో మరమ్మతులు చేశారు. అయినా రోడ్డు పూర్తిగా వేయకుండా వదిలేశారు. కూసుమంచి మండలం పాలేరు నుంచి మల్లాయిగూడెం మార్గంలో నాలుగేళ్ల క్రితం రోడ్డుపై గుంతలు తేలాయి.

మత్తు పదార్థాలను తరిమికొట్టాలి..

- యువత ముందుకొస్తేనే ఇది సాధ్యం
- అవగాహన ర్యాలీలో సీపీ సునీల్‌దత్

ఖమ్మంక్రైం: మెరుగైన సమాజ నిర్మాణానికి మత్తుపదార్థాలను తరిమికొట్టాల్సిన అవసరముందని పోలీసు కమిషనర్ సునీల్‌దత్ పిలుపునిచ్చారు. యువత సంపూర్ణ సహకారంతోనే ఇది సాధ్యమవుతుందని చెప్పారు. అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా పోలీస్, జిల్లా సంక్షేమ శాఖ ఆధ్వర్యాన బుధవారం జిల్లావ్యాప్తంగా అవగాహన ర్యాలీలు నిర్వహించారు. ఇందులో భాగంగా ఖమ్మంలోని పటేల్ స్టేడియం నుంచి లకారం ట్యాంక్ బండ్ వరకు నిర్వహించిన ర్యాలీని సీపీ ప్రారంభించి మాట్లాడారు. మత్తుపదార్థాల వల్ల అనర్థాలను యువత గుర్తించి వాటి బారిన పడకుండా కాపాడుకుంటూనే ఇతరులకూ అవగాహన కల్పించాలని సూచించారు. యువత, విద్యార్థులు యాంటీ డ్రగ్స్ కమిటీల్లో సభ్యులు చేరితే మంచి ఫలితాలు వస్తాయని తెలిపారు. ఎక్కడైనా గంజాయి విక్రయాలు జరుగుతున్నట్లు తెలిస్తే టోల్‌ఫ్రీ నంబర్ 871267 1111కు సమాచారం ఇవ్వాలని సూచించారు. కాగా, గడిచిన ఆరేళ్లలో జిల్లాలో 204 కేసుల్లో 265మందిని అరెస్ట్ చేసి రూ.11కోట్ల విలువైన 9,008 కేజీల గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు సీపీ తెలిపారు. అలాగే, మత్తుపదార్థాలకు అలవాటు పడిన 165మందికి సైకాలజిస్టుల ద్వారా కౌన్సెలింగ్ ఇప్పించామని చెప్పారు. ఈకార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి రాంగోపాల్‌రెడ్డి, అడిషనల్ డీసీపీ ప్రసాద్‌రావు, ఏసీపీలు రమణమూర్తి, శ్రీనివాసులు భానుప్రకాష్, శ్రీహరి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీలో పాల్గొన్న సీపీ సునీల్‌దత్, వివిధ శాఖల అధికారులు



ప్రతిజ్ఞ చేస్తున్న యువకులు, విద్యార్థులు

నేనున్నా.. మీకేం కాదు!

కేఎంసీ సిబ్బందికి ఓ ఉద్యోగి భరోసా

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో ఔట్ సోర్సింగ్ సిబ్బంది తీరుపై వస్తున్న విమర్శలను ఆసరాగా చేసుకుని ఓ ఉద్యోగి చక్రం తిప్పే ప్రయత్నం చేస్తున్నట్లు తెలుస్తోంది. విధినిర్వహణలో ఔట్ సిబ్బంది నిర్లక్ష్యం, అక్రమాలపై పత్రికల్లో వరుస కథనాలు వస్తున్నాయి. ఇంతలోనే నూతన కమిషనర్ అభిషేక్ అగస్త్య విధుల్లో చేరారు. దీంతో ఆయన ప్రత్యేక దృష్టి సారిస్తే పలువురిపై చర్యలు తీసుకునే అవకాశమున్నందున విమర్శలు ఎదుర్కొంటున్న సిబ్బంది వివరాలను ఓ ఉద్యోగి సేకరిస్తున్నట్లు సమాచారం. ఈ జాబితా ఆధారంగా కొందరికి ఫోన్ చేస్తూ 'అంతా నేను చూసుకుంటాను.. మీకేం కాదు' అని భరోసా ఇచ్చే ప్రయత్నాల్లో ఉన్నట్లు తెలిసింది. అయితే, సదరు ఉద్యోగి బయట నుంచి వచ్చి పెత్తనం చేస్తూ ఇప్పటికే తలనొప్పి తీసుకొస్తుండడంతో తాజాగా ఆయన చర్యలతో కేఎంసీ ప్రతిష్ట మరింత దిగజారే అవకాశముందని కార్యాలయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ఈనేపథ్యాన కొత్తగా వచ్చిన కమిషనర్ ఈ అంశంపై ప్రత్యేక దృష్టి సారించాలని పలువురు కోరుతున్నారు.

28న పాలేరులో మెగా జాబ్ మేళా

- మంత్రి పొంగులేటి చొరవతో ఏర్పాటు
- 5వేల మందికి ఉపాధి కల్పనే లక్ష్యం

కూసుమంచి: పాలేరు నియోజకవర్గంతో పాటు జిల్లాలోని నిరుద్యోగ యువతకు ఉద్యోగావకాశాలు కల్పించడమే లక్ష్యంగా రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి చొరవతో జాబ్‌మేళా ఏర్పాటవుతోంది. ఇటీవల తెలంగాణ సొసైటీ ఫర్ ట్రెనింగ్ అండ్ ఎంప్లాయ్‌మెంట్ ప్రమోషన్(టీజీఎస్‌టీఈపీ) చైర్మన్‌కు మంత్రి లేఖ రాయగా, జిల్లా యువజన సర్వీసుల శాఖ ఆధ్వర్యాన ఈనెల 28న కూసుమంచి మండలం పాలేరులో మెగా జాబ్‌మేళా నిర్వహణకు సిద్ధమయ్యారు. ఈ మేళాలో 60కి పైగా కంపెనీల బాధ్యులు పాల్గొననుండగా 7వ తరగతి నుంచి పీజీ వరకు అర్హత కలిగి 18 నుంచి 35 ఏళ్ల లోపు నిరుద్యోగులు 5వేల మందికి ఉపాధి కల్పించాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నారు.

పోస్టర్ల ఆవిష్కరణ

ఖమ్మం రాపర్తినగర్: కూసుమంచి మండలం పాలేరులో ఈనెల 28న జిల్లాస్థాయి జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ తెలిపారు. ఈ సందర్భంగా జెడ్పీ సమావేశ మందిరంలో బుధవారం ఆయన పోస్టర్లు ఆవిష్కరించి మాట్లాడారు. యువజన సర్వీసుల శాఖ, టీజీఎస్‌టీఈపీ ఆధ్వర్యాన నిర్వహించే జాబ్ మేళాలో పాల్గొనేందుకు యువతీ, యువకులు http:forms.gle/aWH1uo5pos6RrT3D6 లింక్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. మేళాకు హాజరయ్యే వారు అర్హత సర్టిఫికెట్లు, పాస్‌పోర్ట్ సైజ్‌ఫొటోలు తీసురావాలని, వివరాలకు 88867 11991, 96423 33668 నంబర్లలో సంప్రదించాలని అదనపు కలెక్టర్ సూచించారు. ఈకార్యక్రమంలో డీవైఎస్ఓ టి.సునీల్‌కుమార్‌రెడ్డి, జిల్లా విద్యా శాఖాధికారి సోమశేఖరశర, జెడ్పీ సీఈఓ ఎస్.వినోద్ తదితరులు పాల్గొన్నారు.



జాబ్‌మేళా పోస్టర్లు ఆవిష్కరిస్తున్న అదనపు కలెక్టర్ మధుసూదన్, అధికారులు నాయక్

రీజియన్‌లో 620 బస్సులు

నేలకొండపల్లి: ఖమ్మం రీజియన్‌లో ఏడు ఆర్టీసీ డిపోల నుంచి 620 బస్సుల ద్వారా ప్రయాణికులకు గమ్యస్థానాలకు చేరవేస్తున్నట్లు రీజినల్ మేనేజర్ అజ్మీరా సరిరామ్ వెల్లడించారు. నేలకొండపల్లిలోని బస్టాండ్‌ను బుధవారం తనిఖీ చేసిన ఆయన బస్టాండ్‌లోకి బస్సులు వస్తున్నాయా, లేదా అని తీశారు. చాన్నాళ్ల తర్వాత ఆవరణలోకి బస్సులు వస్తున్నందున ప్రయాణికులు వినియోగించుకోవాలని సూచించారు. అలాగే, బస్టాండ్‌లో చెత్తాచెదారం తొలగించాలని సిబ్బందిని ఆదేశించారు. అనంతరం ఆర్ఎం మాట్లాడుతూ రీజియన్‌లోని ప్రయాణికుల్లో 50శాతం మేర మహాలక్ష్మి ద్వారా ప్రయాణిస్తున్నారని తెలిపారు. రద్దీకి అనుగుణంగా అవసరమైన రూట్లలో అదనపు బస్సులు నడిపిస్తున్నామని చెప్పారు. కాగా, సంస్థకు ఆదాయం సమకూర్చేందుకే ఆర్టీసీ పరిధిలోని ఖాళీ స్థలాలను నిబంధనలకు అనుగుణంగా లీజ్‌కు ఇస్తున్నట్లు తెలిపారు. ఆయన వెంట ఖమ్మం డిపో మేనేజర్ శ్రీనివాసరావు, అసిస్టెంట్ మేనేజర్ రామయ్య తదితరులు పాల్గొన్నారు.



నేలకొండపల్లి బస్టాండ్ ఆవరణలో పరిశీలిస్తున్న ఆర్ఎం సరిరామ్


ఆర్అండ్బీ ఎస్ఈ కార్యాలయానికి మెరుగులు

- రూ.15లక్షల వ్యయంతో మరమ్మతులు
- కలెక్టరేట్ నుంచి ఈఈ ఆఫీస్ కూడా తరలింపు

ఖమ్మంఅర్బన్: జిల్లా కేంద్రంలో ఆర్అండ్బీ శాఖకు చెందిన పక్కా భవనం పాత కలెక్టరేట్ పక్కన ఉండగా.. కొన్నాళ్ల క్రితం స్వాధీనం చేసుకుని ప్రభుత్వ మెడికల్ కాలేజీ అవసరాలకు కేటాయించారు. దీంతో ఆర్అండ్బీ సర్కిల్ కార్యాలయాన్ని డీఆర్‌డీఏ పాత భవన సముదాయం పైఅంతస్తులో ఏర్పాటు చేసుకున్నారు. అయితే, ఆ భవనం అప్పటికే రంగులు వెలిసిపోయి, తలుపులు, ఫ్లోరింగ్ దెబ్బతిని ఉండడమే కాక టాయిలెట్ల సౌకర్యం లేకపోవడంతో ఉద్యోగులు ఇబ్బంది పడుతూనే విధులు నిర్వర్తించారు. ఇటీవల జిల్లాకు వచ్చిన ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో మరమ్మతుల కోసం .రూ15 లక్షలు కేటాయించారు. దీంతో భవనానికి రంగులు వేయించడంతో పాటు టాయిలెట్ల నిర్మాణం తదితర పనులు చేపట్టారు. ప్రస్తుతం ఈఈ శ్యాం ప్రసాద్ ఎస్ఈగా అదనపు బాధ్యతలు నిర్వర్తిస్తుండగా ఆయన ఈ నెల 30 ఉద్యోగ విరమణ చేయనున్నారు. అనంతరం కొత్త ఎస్ఈ వచ్చేనాటికి పనులు పూర్తయ్యే అవకాశముందని తెలుస్తోంది.

ఈఈ కార్యాలయం ఇక్కడకే..

కొత్త కలెక్టరేట్ ప్రారంభమయ్యాక ఆర్అండ్బీ ఖమ్మం ఈఈ కార్యాలయాన్ని సైతం అక్కడకే తరలించారు. కానీ ఎస్ఈ కార్యాలయం ఖమ్మంలో కొనసాగుతుండడంతో పరిపాలన పరంగా ఇబ్బందులు ఎదురయ్యాయి. ఇటీవల కలెక్టర్‌గా వచ్చిన ముజమ్మిల్‌ఖాన్ కలెక్టరేట్‌లో పలు విభాగాల మార్పులపై సూచనలు చేయడంతో ఈఈ కార్యాలయాన్ని సైతం ఎస్ఈ కార్యాలయం పక్కనే ఖాళీగా ఉన్న గదుల్లోకి చేర్చడంతో అన్నీ ఒకచోటకు వచ్చినట్లయింది.



ఎస్ఈ కార్యాలయానికి రంగులు వేస్తున్న కార్మికులు

న్యూస్‌రీల్

జమలాపురం హుండీ ఆదాయం రూ.48.12 లక్షలు



కానుకలు లెక్కిస్తున్న సిబ్బంది, అర్చకులు

ఎర్రుపాలెం: మండలంలోని జమలాపురం శ్రీవేంకటేశ్వరస్వామి వారి ఆలయం హుండీల్లో భక్తులు సమర్పించిన కానుకలను బుధవారం లెక్కించారు. దేవాదాయ శాఖ ఖమ్మం డివిజన్ ఇన్‌స్పెక్టర్ ఆర్.సమత, ఆలయ ఈఓ కె.జగన్మోహన్‌రావు ఆధ్వర్యాన లెక్కింపు చేపట్టగా 91 రోజులకు గాను రూ.48,12,573 ఆదాయం నమోదైంది. ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త ఉప్పల శ్రీరామచంద్రమూర్తి, ప్రధాన అర్చకులు ఉప్పల శ్రీనివాసశర్మ, ముఖ్య అర్చకులు విజయదేవశర్మ, సూపరింటెండెంట్ విజయకుమారి, అర్చకులు, సిబ్బందితో పాటు మధిరకు చెందిన శ్రీసత్యసాయి సేవాసమితి సభ్యులు పాల్గొన్నారు.

నేడు భద్రాద్రి జిల్లాలో డిప్యూటీ సీఎం భట్టి, మంత్రుల పర్యటన

ఖమ్మంవన్‌టౌన్: డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, రాష్ట్ర మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డి గురువారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో పర్యటించనున్నారు. హెలీకాప్టర్‌లో ఉదయం 10.40 గంటలకు కొత్తగూడెం చేరుకోనున్న వారు కొత్తగూడెం మున్సిపాలిటీలో అమృత్ 2.0 పథకం ద్వారా తాగునీటి సరఫరా పథకం పనులకు శంకుస్థాపన చేస్తారు. అనంతరం గోదావరి వరదల సన్నద్ధతపై అధికారులతో సమీక్షించనున్నారు. ఆతర్వాత హెలీకాప్టర్‌లో మణుగూరుకు చేరుకుని ఇటీవల మృతి చెందిన పద్మశ్రీ అవార్డు గ్రహీత సకిన రామచంద్రయ్య కుటుంబం, తల్లిని కోల్పోయిన పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు కుటుంబ సభ్యులను పరామర్శిస్తారు. అక్కడి నుంచి హైదరాబాద్ బయలుదేరతారు.

వచ్చే నెలలో వంద పడకల ఆస్పత్రి ప్రారంభం



వైద్యులతో మాట్లాడుతున్న సూపరింటెండెంట్ వెంకటేశ్వర్లు

సత్తుపల్లిటౌన్: సత్తుపల్లిలోని 50 పడకల ఆస్పత్రిని 100 పడకలుగా అప్‌గ్రేడ్ చేసిన నేపథ్యాన వచ్చే నెలలో ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నామని జిల్లా మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ బి.వెంకటేశ్వర్లు వెల్లడించారు. సత్తుపల్లి ఏరియా ప్రభుత్వాస్పత్రిని బుధవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా నిర్మాణంలో ఉన్న వంద పడకల ఆస్పత్రిని పరిశీలించి మిగులు పనుల పూర్తిపై సూచనలు చేశారు. కాగా, సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందే అవకాశమున్నందున మందుల కొరత రానివ్వొద్దని, వైద్యులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు, వైద్యులు ఎస్.కిరణ్‌కుమార్, స్రవతి, శివకృష్ణ, సురేష్, నారాయణరావు, పృథ్వీ, ఉద్యోగులు సతీష్, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

28నెలలకే ఆయిల్‌పామ్ దిగుబడి



ఆయిల్‌పామ్ తోటలో పరిశీలిస్తున్న అధికారులు

పెనుబల్లి: కల్లూరుకు చెందిన రైతు రామారావు పెనుబల్లి మండలం టేకులపల్లిలో సాగు చేసిన ఆయిల్‌పామ్ తోట 28 నెలలకే దిగుబడి మొదలైంది. సహజంగా 36నెలలకు మొదలుకావాల్సిన దిగుబడి ముందుగానే రావడంతో ఆయిల్‌ఫెడ్ అధికారులు బుధవారం పరిశీలించారు. ఈమేరకు రామారావు తన క్షేత్రంలో అవలంబించిన సాగు విధానాలను పైలట్‌గా స్వీకరించి ఇతర రైతులకు దరికి చేరుస్తామని ఆయిల్‌ఫెడ్ జిల్లా అధికారి భారతి వెల్లడించారు. ఈ కార్యక్రమంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధికారి బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

స్టాఫ్‌నర్స్ పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

ఖమ్మంమయూరిసెంటర్: తెలంగాణ మైనారిటీ గురుకుల పాఠశాల, కళాశాలల్లో స్టాఫ్‌నర్స్ పోస్టులను ఔట్‌సోర్సింగ్ విధానంలో భర్తీ చేయనున్నట్లు జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి ఎంఏ.మహమూది తెలిపారు. ఖమ్మం బాలుర మైనార్టీ గురుకులం, సత్తుపల్లి బాలుర మైనారిటీ గురుకులంలో ఒక్కో పోస్టు ఖాళీగా ఉన్నాయని పేర్కొన్నారు. అర్హత కలిగిన వారు జూలై 2వ తేదీలోగా కలెక్టరేట్‌లోని రీజినల్ కోఆర్డినేటర్ కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలని, వివరాలకు 89857 85193, 83412 85110 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

దేవాదాయ ఉద్యోగ, అర్చక సంఘం రాష్ట్ర కమిటీ ఎన్నిక

ఖమ్మంగాంధీచౌక్: రాష్ట్ర దేవాదాయ, ధర్మాదాయ శాఖ ఉద్యోగ, అర్చక సంఘం రాష్ట్ర నూతన కమిటీని బుధవారం ఎన్నుకున్నారు. ఖమ్మంలోని శ్రీ గుంటు మల్లేశ్వర స్వామి దేవాలయంలో జరిగిన ఎన్నికల్లో అధ్యక్షుడిగా ఉడతనేని రామారావు, ఉపాధ్యక్షులుగా ఉప్పల శ్రీనివాసశర్మ, పీవీ.రమణారావు, ప్రధాన కార్యదర్శిగా తోటకూర వెంకటేశ్వర్లు ఎన్నికయ్యారు. అలాగే, సహాయ కార్యదర్శులుగా బి.మురళి, ఎస్.విశ్వనాథశర్మ, సలహాదారుగా పి.ప్రవీణ్‌కుమార్, సాంస్కృతిక విభాగం ప్రతినిధిగా ఐ.శ్రీనివాసరావు, కోశాధికారిగా కె.రామశర్మతో పాటు గౌరవ అధ్యక్షుడిగా కొడమంచలి రాధాకృష్ణశర్మ ఎన్నికయ్యారని సంఘం బాధ్యులు వెల్లడించారు.

మహిళ వేళ్లు నరికిన కేసులో నాలుగేళ్ల జైలు శిక్ష

ఖమ్మం లీగల్: కూసుమంచి మండలం ఈశ్వరమాదారం గ్రామానికి చెందిన మాచిరెడ్డి రామకోటమ్మ వేళ్లు నరికిన కేసులో అదే గ్రామానికి చెందిన నందిరెడ్డి మోహన్‌రెడ్డికి నాలుగేళ్ల జైలు శిక్ష విధిస్తూ ఖమ్మం ప్రిన్సిపల్ అసిస్టెంట్ సెషన్స్ జడ్జ్ కే.వీ.చంద్రశేఖరరావు బుధవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం.. 2017 జూలై 29న మోహన్‌రెడ్డి ఆయన పొలంలోని కంపచెట్లను నరికి పక్కనే ఉన్న రామకోటమ్మ పొలంలో వేస్తున్నాడు. ఈ విషయమై ప్రశ్నించగా ఆయన గొడ్డలితో రామకోటమ్మను నరకటానికి రాగా చేయి అడ్డుపెట్టడంతో వేళ్లు తెగిపోయాయి. ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. సాక్షుల విచారణ అనంతరం నేరం రుజువు కావడంతో నిందితుడికి నాలుగేళ్ల జైలు శిక్ష విధిస్తూ జడ్జి తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ తరఫున ఏపీపీలు కృష్ణమోహన్, బెల్లం ప్రతాప్‌రావు వాదించగా, లైజన్ ఆఫీసర్ మోహన్‌రావు సహకరించారు.

రోడ్డుప్రమాదంలో ఒకరు మృతి

రఘునాథపాలెం: మండలంలోని రఘునాథపాలెం–చింతగుర్తి రోడ్డులో బుధవారం రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్న ప్రమాదంలో ఒకరు మృతిచెందగా ఇంకొకరికి తీవ్రగాయాలయ్యాయి. సీఐ శ్రీహరి తెలిపిన వివరాల మేరకు... మండలంలోని రాంక్యాతండాకు చెందిన మునావర్ నారాయణసింగ్(58) ఖమ్మం వెళ్లి వస్తుండగా దొనబండకు చెందిన లింగయ్య ఎదురుగా మరో ద్విచక్ర వాహనంపై వస్తూ ఢీకొట్టాడు. ఈ ఘటనలో నారాయణసింగ్‌కు తీవ్రగాయాలు కాగా ఆస్పత్రికి తరలించేలోగా మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఇదే ఘటనలో లింగయ్యకు సైతం తీవ్ర గాయాలయ్యాయి. ఘటనపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

యువతి ఫొటోలు మార్ఫింగ్ చేసిన వ్యక్తిపై సైబర్ కేసు

ఖమ్మంక్రైం: ఓ యువతి ఫొటోలను అసభ్యకరమైన రీతిలో మార్ఫింగ్ చేయడమే కాక ఆమె పేరిట ఇన్‌స్టాగామ్ ఖాతా తెరిచి పోస్ట్ చేస్తున్న వ్యక్తిపై సైబర్ క్రైమ్ పోలీసులు కేసు నమోదు చేసి అరెస్ట్ చేశారు. ఈమేరకు ఏసీపీ ఫణీందర్ బుధవారం వివరాలు వెల్లడించారు. కల్లూరు మండలం వెన్నపల్లి కి చెందిన వాకదాని వెంకటకృష్ణ ఓ యువతికి సంబంధించి తప్పుడు ఇన్‌స్టాగామ్ ఖాతా తెరిచాడు. ఆమె ముఖంతో కూడిన అసభ్యకరమైన ఫొటోలను మార్ఫింగ్ ద్వారా తయారుచేసి ఆ ఖాతా ద్వారా ఆమె కుటుంబసభ్యులకు పంపిస్తున్నాడు. పలుమార్లు కుటుంబీకులు హెచ్చరించినా వెంకటకృష్ణ మారకపోవడంతో ఖమ్మంలోని సైబర్ క్రైమ్ పోలీసులను ఆశ్రయించారు. దీంతో ఎస్‌ఐ రంజిత్‌కుమార్, సిబ్బంది సంతోష్‌కుమార్, వైవీ.కృష్ణారావు నిందితుడిని గుర్తించగా బుధవారం అరెస్ట్ చేసినట్లు ఏసీపీ తెలిపారు.

దానవాయిగూడెంలో వరుస చోరీలు

ఖమ్మంఅర్బన్: ఖమ్మం దానవాయిగూడెంలో వరుసగా చోరీలు జరుగుతున్నాయి. గత రెండు రోజుల్లో నాలుగు ఇళ్లలో దొంగతనాలు జరిగాయని తెలిసింది. స్థానికులు పనులకు వెళ్లిన సమయాన మధ్యాహ్నం తాళాలు పగలగొడుతున్న నిందితులు చోరీలకు తెగబడుతున్నారు. ఎనిమిది తులాల బంగారం, 15 తులాలపైగా వెండి ఆభరణాలతోపాటు రాగి, ఇత్తడి బిందెలను ఎత్తుకెళ్లగా బాధితుల ఫిర్యాదుతో ఖమ్మం అర్బన్ పోలీసులు విచారిస్తున్నట్లు తెలిసింది. అయితే, కేసు మాత్రం నమోదు కాలేదని పోలీసులు తెలిపారు.

పామాయిల్ గెలలు

టన్ను ధర	రూ.13,438

మామిడి.. రుమాడీ!

- ఖమ్మంలో తమిళనాడు మామిడి విక్రయం
- ఆపిల్‌ను పోలిన రూపు.. బంగినపల్లి తరహా రుచి
- జిల్లాలో జోరుగా అమ్మకాలు


విక్రయానికి సిద్ధంగా ఉన్న రుమాడి రకం మామిడి పండ్లు

ఖమ్మంవ్యవసాయం: లెక్క ప్రకారమైతే మామిడి పండ్ల సీజన్ అయిపోయింది. కానీ మార్కెట్‌లో ఇంకా మామిడిపండ్ల విక్రయాలు కొనసాగుతున్నాయి. ఒకటి, రెండు చోట్ల మాత్రం బంగినిపల్లి రకం అమ్ముతుండగా.. ఇంకొన్ని చోట్ల మునుపెన్నడూ చూడని రంగు, రూపులో మామిడిపండ్లు కనిపిస్తున్నాయి. ఇవేమిటా అని ఆరా తీస్తే రుమాడీ రకాన్ని తమిళనాడు నుంచి తెప్పిస్తున్నామని వ్యాపారులు చెబుతున్నారు. సాధారణంగా మన దగ్గర తీపి మామిడి పండ్లలో ప్రధాన రకం బంగినపల్లి. వీటిని తినేందుకు ప్రజలు ఇష్టపడతారు. కానీ ఈ పండ్ల సీజన్ పూర్తయ్యింది. అయితే బంగినపల్లి స్థానంలో ప్రస్తుతం తమిళనాడు రాష్ట్రం నుంచి 'రుమాడీ' రకం పండ్లను పలువురు హోల్‌సేల్ వ్యాపారులు దిగుమతి చేసుకొని విక్రయిస్తున్నారు.

నెల రోజుల తేడాతో....

బంగినపల్లి మామిడి సీజన్‌కు రుమాడీ రకం సీజన్‌కు మధ్యలో నెల రోజుల వ్యవధి ఉంటుంది. బంగినపల్లి రకం సీజన్ ఇప్పటికే దాదాపు పూర్తయింది. దీంతో ఇప్పుడు రుమాడి విక్రయాలు మొదలయ్యాయి. తమిళనాడుతో పాటు ఆ రాష్ట్రానికి సరిహద్దుగా ఉండే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని తడ, శ్రీకాళహస్తి తదితర ప్రాంతాల నుంచి ఈ రకాన్ని వ్యాపారులు దిగుమతి చేసుకుని విక్రయిస్తున్నారు. ఇవి చూడడానికి ఆపిల్ రూపంలో ఉండగా, పండినవి కూడా అదే రంగులో ఉన్నాయి. రుచి బంగినిపల్లి తరహాలో తీయగా ఉండడం... కిలో రూ.70 నుంచి రూ. 100 వరకు ధర పలుకుతుండగా కొనుగోళ్లు జోరుగా సాగుతున్నాయి.

గిరాకీ బాగుంది..



తమిళనాడు, ఏపీలోని పలు చోట్ల నుంచి తెప్పిస్తున్న రుమాడీ రకం మామిడి పండ్లు బంగినపల్లి మాదిరే రుచి ఉంటాయి. సీజన్ ఇటీవలే మొదలుకావడంతో దిగుమతి చేసుకుని విక్రయిస్తున్నాం. ఇవి కొన్నాళ్లే అందుబాటులో ఉంటాయి. ప్రస్తుతానికి బంగినిపల్లి అందుబాటులో లేకపోవడంతో వీటికి గిరాకీ బాగానే ఉంది.

– అన్నపు మల్లికార్జున్, పండ్ల వ్యాపారి, కస్బా బజార్, ఖమ్మం

అటవీ జంతువుల వేట.. ముక్కలు చేస్తూ వీడియోలు

వ్యక్తిని అరెస్ట్ చేసిన ఫారెస్ట్ అధికారులు


అరెస్ట్ అయిన వంశీతో అటవీశాఖ అధికారులు

ఖమ్మంవన్‌టౌన్: అటవీ జంతువులను వేటాడమే కాక వాటి మాంసాన్ని ముక్కలు చేస్తున్న వీడియోలు తీస్తున్న వ్యక్తిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఖమ్మం డివిజన్ అటవీ అధికారి వి.మంజుల తెలిపారు. ఖమ్మంలో బుధవారం మాట్లాడుతూ... ఖమ్మం రూరల్ మండలం పోలేపల్లికి చెందిన తమ్మిశెట్టి వంశీ తన స్నేహితులతో కలిసి అటవీ జంతువులైన ఉడుత, ఉడుము, అడవిపిల్లి, కుందేళ్లను ఉచ్చులు, వలల సాయంతో బంధిస్తున్నాడు. ఆపై వాటిని ముక్కలు చేస్తూ వీడియో తీసి సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేస్తున్నాడు. ఈవిషయమై అందిన సమాచారంతో వంశీని బుధవారం అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపర్చినట్లు అధికారులు తెలిపారు. ఈసమావేశంలో అధికారులు పి.శ్రీనివాసరావు, సురేష్, డానియేల్, హరికృష్ణ, రాధ, కిషోర్, రాంబాబు పాల్గొన్నారు.

కదులుతున్న మనీ సర్క్యులేషన్ డొంక

- సమగ్రంగా దర్యాప్తు చేస్తున్న పోలీసులు
- త్వరలోనే నిందితుల వివరాలు వెల్లడించే అవకాశం

నేలకొండపల్లి: మనీ సర్క్యులేషన్ స్కీంలో అధిక వడ్డీ ఆశకు వెళ్లి అసలుకే ఎసరు తెచ్చుకున్న బాధితుల సంఖ్య నానాటికీ పెరుగుతోంది. నేలకొండపల్లి మండలంలోని మంగాపురం తండాకు చెందిన స్కీం నిర్వాహకుడు వీరన్నను ఇప్పటికే అదుపులోకి తీసుకున్న పోలీసులు విచారించగా బాధితులు 550మంది వరకు ఉన్నారని గుర్తించినట్లు తెలిసింది. అయితే, వీరన్న ఫోన్ నుంచి బాధితులకు ఫోన్ చేయగా పలువురు తప్పుడు చిరునామా, ఫోన్ నంబర్లు ఇచ్చినట్లు గుర్తించారు. ఇంకొందరు ఫోన్‌కు స్పందించినా కొద్ది మొత్తంలో నగదు కోల్పోయినందున ఫిర్యాదు చేసేందుకు సుముఖత చూపడం లేదని సమాచారం. ఈనేపథ్యాన వీరన్నతో పాటు స్కీం బాధ్యతలు నిర్వర్తించిన వారిని అదుపులోకి తీసుకోవడంపై పోలీసులు దృష్టి సారించి వారి బ్యాంకు ఖాతాలను పరిశీలిస్తున్నట్లు తెలిసింది. కాగా, సంస్థ డైరెక్టర్లు, ప్రధాన సూత్రధారులకు ఆయన కార్లు బహుమతిగా ఇచ్చినట్లు ప్రచారం జరుగుతోంది. దీంతో పోలీసులు నేలకొండపల్లి, సదాశివాపురం, మునగాల, హుజూర్‌నగర్, కోదాడ తదితర మండలాల్లో బాధ్యులను గుర్తించి అదుపులోకి తీసుకోనుండగా.. రెండు రోజుల్లో వివరాలు వెల్లడించనున్నారని తెలిసింది. ఈ విషయమై స్పందించడానికి మాత్రం ఎస్సై తోట నాగరాజు నిరాకరించారు.

నేడు సీతారామ పంప్‌హౌస్ ట్రయల్ రన్!

కసరత్తు చేస్తున్న అధికారులు


ట్రయల్‌రన్‌కు సిద్ధమైన పంప్‌హౌస్ మోటార్లు

అశ్వాపురం: మండల పరిధిలోని బీజీ కొత్తూరు గ్రామంలో సీతారామ ప్రాజెక్ట్ ఫేస్–1 పంప్‌హౌస్ ట్రయల్ రన్‌కు జలవనరుల శాఖ అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. గురువారం ఓ విద్యుత్ మోటారు ట్రయల్ రన్ ద్వారా నీరు ఎత్తిపోసేందుకు ముమ్మర కసరత్తు చేస్తున్నారు. ట్రయల్ రన్ విజయవంతమైతే అధికారికంగా కార్యక్రమం చేపట్టనున్నారు. ఈనెల 13న డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు సీతమ్మ సాగర్ బ్యారేజీని, సీతారామ ప్రాజెక్ట్ పంప్‌హౌస్‌ను, కెనాల్‌ను సందర్శించారు. పంప్‌హౌస్‌లో డిప్యూటీ సీఎం, మంత్రులు ప్రత్యేక పూజలు చేసి విద్యుత్ సరఫరా ప్రక్రియను ప్రారంభించారు. గత పది రోజులుగా ఈఈ వెంకటేశ్వర్‌రావు, డీఈ శ్రీనివాసరావు, ఏఈల ఆధ్వర్యంలో ట్రయల్‌రన్ ప్రక్రియ పనులు ముమ్మరంగా చేపడుతున్నారు. పంప్‌హౌస్‌లో ఆరు మోటార్లు ఉన్నాయి. దుమ్ముగూడెం ఆనకట్ట నుంచి గ్రావిటీ కెనాల్ ద్వారా గోదావరి నీరు బీజీకొత్తూరు పంప్‌హౌస్ వరకు రాగా పంప్‌హౌస్ ద్వారా నీరు ఎత్తిపోయనున్నారు. సీతారామ ప్రాజెక్ట్ ద్వారా 70.40 టీఎంసీల నీరు 9000 క్యూసెక్కుల ప్రవాహంతో ఎత్తిపోయనున్నారు.

మూడేళ్ల క్రితం పూర్తయిన పనులు..

బీజీ కొత్తూరులో సీతారామ ప్రాజెక్ట్ ఫేజ్–1 పంప్‌హౌస్‌కు 2017 ఏప్రిల్ 25న అప్పటి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు శంకుస్థాపన చేశారు. నాలుగేళ్లలో పనులు పూర్తి చేశారు. దీంతో మూడేళ్ల క్రితమే డ్రై రన్‌కు సిద్ధమైంది. అయితే డ్రై రన్ చేస్తే విద్యుత్ బిల్లులు రూ.లక్షల్లో చెల్లించాల్సి వస్తుందని గత ప్రభుత్వం ఆ ప్రక్రియ చేపట్టలేదు. పంప్‌హౌస్‌కు విద్యుత్ కనెక్షన్ కూడా ఇవ్వలేదు. పంప్‌హౌస్ డ్రై రన్ చేసినా ఒక్క ఎకరాకు నీరు అందించే పరిస్థితి లేదు. నూతన కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డాక డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి సీతారామ ప్రాజెక్ట్ పనులపై ప్రత్యేక దృష్టి సారించారు. పలుమార్లు ప్రాజెక్ట్ పనులను సందర్శించి అధికారులతో సమీక్షలు నిర్వహించి పనుల వేగవంతానికి ఆదేశాలు జారీ చేశారు. ఆగస్టు 15 వరకు జిల్లాలో సీతారామ ప్రాజెక్ట్ ద్వారా సాగునీరు అందించాలనే లక్ష్యంతో పనులు వేగవంతంగా చేపడుతున్నారు. డిప్యూటీ సీఎం, మంత్రుల ఆదేశాలతో బీజీకొత్తూరు పంప్‌హౌస్ ట్రయల్ రన్‌కు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు.

విన్యాసాలు అదుర్స్!


పడుకున్న వారి పైనుంచి వాహనం నడిపిస్తున్న దృశ్యం

ఖమ్మం స్పోర్ట్స్: ఖమ్మంలోని పెవిలియన్ మైదానంలో కొన్నాళ్లుగా కొనసాగుతున్న ఉచిత కరాటే శిక్షణ శిబిరం బుధవారం ముగిసింది. ఈసందర్భంగా శిక్షణ పూర్తిచేసుకున్న అభ్యర్థులు, కోచ్‌లు ప్రదర్శించిన విన్యాసాలు ఆకట్టుకున్నాయి. సినిమాల్లో మాదిరి ముగ్గురు విద్యార్థులు పడుకంటే వారి పైనుంచి ద్విచక్ర వాహనం నడపడం వంటి విన్యాసాలను స్థానికులు ఆశ్చర్యంగా చూశారు. అనంతరం అభ్యర్థులకు కార్పొరేటర్ బుడిగం శ్రీనివాస్‌తో పాటు డాక్టర్ సామినేని సీతయ్య సర్టిఫికెట్లు అందజేయగా, కోచ్ బాబుతో పాటు పాషా, షకీరా, వెంకట్, సుదర్శన్, శ్రీనివాస్, దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

'లయన్స్' ద్వారా విస్తృతంగా సేవా కార్యక్రమాలు


ఆర్థికసాయం అందజేస్తున్న లయన్స్‌క్లబ్ బాధ్యులు

వైరా: లయన్స్‌క్లబ్ వైరా శాఖ ద్వారా గడిచిన ఏడాది 475 సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని డిస్ట్రిక్ట్ గవర్నర్ డాక్టర్ సీహెచ్‌వీ.శివప్రసాద్ తెలిపారు. వైరాలో మంగళవారం రాత్రి నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు పెనుగొండ ఉపేందర్‌రావు ఓ విద్యార్థికి రాయితీపై ల్యాప్‌టాప్, డాక్టర్ కాపా మురళీకృష్ణ మరో మహిళకు కుట్టు మిషన్ అందజేశారు. అలాగే, వై.రాజారావు, సూతకాని జైపాల్, డాక్టర్ ఉంగ్రు శ్యాంబాబు, వనమా మల్లికార్జునరావు సహకారంతో విద్యార్థులకు చదువు నిమిత్తం ఆర్థిక సాయం అందజేశారు. ఈకార్యక్రమంలో లగడపాటి ప్రభాకర్, పెరుమాళ్ల కృష్ణమూర్తి, మాదినేని సునీత, మిట్టపల్లి వెంకటరమణ, పెంట్యాల భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

ఓసీ విస్తరణ పనులను పరిశీలించిన డైరెక్టర్


కిష్టారం ఓసీని పరిశీలిస్తున్న డైరెక్టర్, అధికారులు

సత్తుపల్లి: మండలంలోని కిష్టారం, సత్తుపల్లి జేవీఆర్ ఓసీ విస్తరణ పనులను సింగరేణి డైరెక్టర్(ప్రాజెక్ట్ అండ్ ప్లానింగ్) జి.వెంకటేశ్వరరెడ్డి, కొత్తగూడెం ఏరియా జనరల్ మేనేజర్ షాలేం రాజు బుధవారం పరిశీలించారు. గని విస్తరణ, బ్లాస్టింగ్ సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అధికారులకు సూచనలు చేశారు. ఈసందర్భంగా జీఎం షాలేం రాజు మాట్లాడుతూ బ్లాస్టింగ్ తీవ్రత పరిమితి మించకుండా చూస్తూ సమీప గ్రామాల ప్రజలు ఇబ్బంది పడకుండా పర్యవేక్షించాలని తెలిపారు. అలాగే, మట్టి తవ్వకంపై పీసీ పటేల్ సంస్థ బాధ్యులకు సూచనలు చేశారు. కిష్టారం ప్రాజెకు ఆఫీసర్ ఎం.వీ.నర్సింహారావు, అధికారులు లక్ష్మణమూర్తి, పి.నర్సింహారావు, రామకృష్ణ, ఎ.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

మూడు టిప్పర్లు స్వాధీనం

నేలకొండపల్లి: అనుమతి లేకుండా మట్టి తరలిస్తున్న టిప్పర్లను బుధవారం సీజ్ చేసినట్లు మైనింగ్ ఏడీ ఆర్.సాయినాథ్ తెలిపారు. మండలంలో జాతీయ రహదారికి మట్టి తరలిస్తున్న రెండు టిప్పర్లతో పాటు ఓ మాజీ ప్రజాప్రతినిధికి చెందిన ఇంకో టిప్పర్ ద్వారా వే బిల్లులు లేకుండా మట్టి తరలిస్తున్నట్లు సమాచారం అందడంతో అధికారులు తనిఖీలు చేపట్టారు. ఈమేరకు మూడింటిని సీజ్ చేసి పోలీస్‌స్టేషన్‌లో అప్పగించగా యజమానులు జరిమానా చెల్లించడంతో వదిలేశారు. కాగా, మండలంలో యథేచ్ఛగా మట్టి దందా సాగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తుండగా, అనుమతి లేకుండా మట్టి తరలిస్తే సహించేది లేదని ఏడీ స్పష్టం చేశారు.

పిచ్చికుక్క దాడిలో బాలుడికి తీవ్రగాయాలు


బాలుడి చేతిపై గాయాలు

కామేపల్లి: పిచ్చికుక్క విక్షణారహితంగా దాడి చేయడంతో ఓ బాలుడికి తీవ్ర గాయాలైన ఘటన మండలంలో చోటుచేసుకుంది. మండలంలోని గోవింద్రాలకు చెందిన జక్కుల సుజన్ కుమార్ స్థానిక ప్రభుత్వ పాఠశాలలో నాలుగో తరగతి చదువుతున్నాడు. బుధవారం పాఠశాల లేకపోవడంతో స్నేహితులతో కలిసి ఆయన ఇంటి వద్ద ఆడుకుంటుండగా అటుగా వచ్చిన పిచ్చికుక్క ఆయన చేతిని పట్టుకుని లాక్కెళ్లసాగింది. దీంతో బాలుడు కేకలు వేయగా స్థానికులు అదిలించడంతో వదిలేసింది. ఈ ఘటనలో బాలుడి చేతిపై పలుచోట్ల తీవ్ర గాయాలు కావడంతో ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

చదువుతో పాటు వ్యాయామం అవసరం



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్, పక్కన అధికారులు (ఇన్‌సెట్) రెస్టారెంట్‌లో తనిఖీ చేస్తున్న అదనపు కలెక్టర్

- అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్
- పీఈటీలకు అవగాహన కార్యక్రమం

ఖమ్మం సహకారనగర్: విద్యార్థులు ఉత్తమ పౌరులుగా ఎదగడానికి చదువుతోపాటు వ్యాయామం కూడా అవసరమని అదనపు కలెక్టర్ డి.మధుసూదన్ నాయక్ అన్నారు. జిల్లా కేంద్రంలోని జెడ్పీ హాల్‌లో వ్యాయామ విద్య ఉపాధ్యాయులకు బుధవారం ఏర్పాటు చేసిన అవగాహనా సదస్సులో ఆయన మాట్లాడారు. పిల్లల శారీరక, మానసిక ఎదుగుదలకు తప్పనిసరన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో క్రీడలకు సంబంధించి సౌకర్యాలు కల్పించి పీఈటీలను నియమించిన నేపథ్యాన విద్యార్థులకు ఆసక్తి పెరిగేలా కృషి చేయాలన్నారు. జిల్లాలో ప్రతీ నియోజకవర్గంలో మినీ స్టేడియంలు కూడా ఉనానయని తెలిపారు. ఈసమావేశంలో జిల్లా విద్యాశాఖాధికారి ఈ.సోమశేఖరశర్మ, జెడ్పీ సీఈఓ వినోద్, డీవైఎస్‌ఓ సునీల్‌కుమార్‌రెడ్డి, కోచ్‌లు మూర్తి, ఎం.డీ.గౌస్ తదితరులు పాల్గొన్నారు.

హోటళ్లు, రెస్టారెంట్లలో పరిశుభ్రత పాటించాలి

ఖమ్మంమయూరిసెంటర్: హోటళ్లు, రెస్టారెంట్లలో పరిశుభ్రతను పాటించాలని అదనపు కలెక్టర్ డి.మధుసూదన్ నాయక్ ఆదేశించారు. జిల్లా కేంద్రంలోని పలుహోటళ్లు, బేకరీలను బుధవారం ఆయన ఫుడ్ సేఫ్టీ అధికారి కిరణ్‌కుమార్‌తో కలిసి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కిచెన్, పరిసరాలు, సరుకుల నాణ్యతను పరిశీలించిన ఆయన నిబంధనలపై సూచనలు చేశారు. కల్తీ పదార్థాలు అమ్మినట్లు తేలితే కఠిన చర్యలుంటాయని హెచ్చరించారు. ఖమ్మం అర్బన్ తహసీల్దార్ సీహెచ్.స్వామి, ఆర్‌ఐలు రమేష్, రవి తదితరులు ఉన్నారు. అలాగే, ఖమ్మం ముస్తఫానగర్‌లోని బీసీ బాలుర సంక్షేమ వసతిగృహాన్ని సైతం అదనపు కలెక్టర్ డి.మధుసూదన్ నాయక్ తనిఖీ చేశారు. వసతిగృహంలో కల్పిస్తున్న సౌకర్యాలపై ఆరా తీసిన ఆయన స్కూళ్లలో విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, యూనిఫామ్ అందిందా అని తెలుసుకున్నారు. హాస్టల్ మెనూ ప్రకారం భోజనం సమకూర్చాలని సిబ్బందికి ఆయన సూచించారు.

సంక్షేమ పథకాల అమలులో రాష్ట్రప్రభుత్వం విఫలం


మాట్లాడుతున్న నాగేశ్వరరావు

ఖమ్మంమయూరిసెంటర్: రాష్ట్రంలో అధికారంలోకి వచ్చి 200 రోజులు దాటుతున్నా, సంక్షేమ పథకాలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు పేర్కొన్నారు. ఖమ్మంలోని సుందరయ్య భవనంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికలకు ముందు ప్రకటించిన ఆరు గ్యారంటీలను అమలు చేయడం లేదన్నారు. ఆగస్టు 15 నాటికి ఎలాంటి షరతులు లేకుండా రైతులందరికీ రుణమాఫీ చేయాలని, ఖరీఫ్ పంటల సాగు మొదలైనందున కౌలు రైతులతో సహా అందరికీ పెట్టుబడి సాయం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అంతేకాక వ్యవసాయ కార్మికులకు రూ.12 వేలు, మహిళలకు రూ.2,500 ఇవ్వడంతో పాటు పెన్షన్ లబ్ధిదారులకు రూ.4 వేలు చెల్లించాలన్నారు. కాగా, భూముల రిజిస్ట్రేషన్ ధరలను సవరిస్తున్న నేపథ్యాన వ్యవసాయ భూముల ధరలు పెంచాలని, తద్వారా బ్యాంకుల్లో రుణాలు అందడమే కాక పరిహారం పెరుగుతుందని చెప్పారు. ఇదేసమయాన వ్యవసాయేతర ధరలు ఎక్కువగా పెంచి సామాన్యులపై భారం మోపొద్దని సూచించారు. ఈ సమావేశంలో నాయకులు యర్రా శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

వాణిజ్య మీటర్లకు కెపాసిటర్లు అమర్చుకోవాలి..

- లేనిపక్షంలో 25శాతం అదనంగా బిల్లు
- నోటీసులు జారీ చేస్తున్న విద్యుత్‌శాఖ

ఖమ్మంఅర్బన్: వాణిజ్య అవసరాల కోసం ఏర్పాటు చేసుకున్న విద్యుత్ కనెక్షన్లకు కెపాసిటర్ అమర్చుకోవాలని, లేనిపక్షంలో నెలవారీ బిల్లుకు అదనంగా 25 శాతం సర్‌చార్జీ చెల్లించాల్సి వస్తుందని అధికారులు ఖమ్మం జిల్లాలో కనెక్షన్లను తనిఖీ చేస్తూ యజమానులకు నోటీసులు జారీ చేస్తున్నారు. కెపాసిటర్లు బిగించుకోవడం వల్ల బిల్లు తగ్గడంతో పాటు వృథా జరగదని, ఓల్టేజీ అంతరాయాలు ఉండవని అవగాహన కల్పిస్తున్నారు. విద్యుత్ మీటర్ లోడ్ ఆధారంగా మూడో వంతు ఉండేలా కెపాసిటర్లను అమర్చుకోవాల్సి ఉంటుందని చెబుతున్నారు. ఇందుకోసం జిల్లా వ్యాప్తంగా 2, 3వ కేటగిరీల మీటర్లను విస్తృతంగా తనిఖీ చేస్తున్నారు. ఏ మీటర్‌కైనా కెపాసిటర్ లేకపోతే నోటీసులు జారీ చేయడమే కాక నెలలోగా అమర్చుకోకపోతే, ఆతర్వాత నుండి వచ్చే విద్యుత్ బిల్లుకు అదనంగా 25శాతం చెల్లించాలని సూచిస్తున్నారు. కాగా, ఒక్కో మీటర్‌కు కెపాసిటర్ అమర్చుకోవాలంటే లోడ్ ఆధారంగా రూ.2వేల నుండి రూ.3వేల వరకు కానుండడంతో భారం పడినట్లేనని వినియోగదారులు చెబుతున్నారు. ఈవిషయమై రఘునాథపాలెం ఏడీ సంజయ్‌కుమార్‌ను వివరణ కోరగా వాణిజ్య అవసరాల కోసం వినియోగించే 2, 3వ కేటగిరీ విద్యుత్ మీటర్లకు కచ్చితంగా కెపాసిటర్లు అమర్చుకోవాలని స్పష్టం చేశారు. లేనిపక్షంలో నోటీసు జారీ చేసిన నెల తర్వాత నుండి వచ్చే బిల్లుకు 25శాతం అదనంగా సర్‌చార్జీ విధిస్తామని తెలిపారు. ఈమేరకు వినియోగదారులు కెపాసిటర్లు అమర్చుకుని విద్యుత్‌శాఖకు సహకరించాలని సూచించారు.

ఉద్యోగోన్నతి పొందిన హెచ్‌ఎస్‌జీలకు పోస్టింగ్

ఖమ్మంగాంధీచౌక్: తపాలా శాఖలో లోయర్ సెకండరీ గ్రేడ్(ఎల్‌ఎస్‌జీ) పోస్ట్‌మాస్టర్ నుంచి హయ్యర్ సెలక్షన్ గ్రేడ్(హెచ్‌ఎస్‌జీ)–2 పోస్ట్‌మాస్టర్‌గా ఉదోగోన్నతి పొందిన ఏడుగురికి బుధవారం పోస్టింగ్ కేటాయించారు. తెలంగాణ తపాలా సర్కిల్ కార్యాలయం పరిధిలో 120 మంది ఉద్యోగోన్నతి లభించగా, ఖమ్మం డివిజన్ పరిధిలో 11 మంది అవకాశం దక్కింది. వీరిలో ఏడుగురికి ఖమ్మం డివిజన్ పరిధిలో పోస్టింగ్ కేటాయిస్తూ డివిజన్ సూపరింటెండెంట్ రవికుమార్ ఉత్తర్వులు జారీచేశారు. ప్రస్తుతం వైరా సబ్ పోస్టాఫీస్‌లో విధులు నిర్వర్తిస్తున్న ఎస్‌వీఎల్.ప్రసన్నను కొత్తగూడెం హెడ్ పోస్టాఫీస్‌కు, మణుగూరులో పనిచేస్తున్న పి అంజయ్యను ఖమ్మం కలెక్టరేట్‌కు, మధిర సబ్ పోస్టాఫీస్ నుంచి పి.యలమందను ఖమ్మం గాంధీచౌక్ సబ్ పోస్టాఫీస్‌కు, ఖమ్మం ట్రంక్ రోడ్ సబ్ పోస్టాఫీస్ లో పనిచేస్తున్న వి.వెంకయ్యను భద్రాచలం హెడ్ పోస్టాఫీస్‌కు కేటాయించారు. అలాగే, ఖమ్మం ఎన్‌ఎస్‌పీ క్యాంప్‌లో విధులు నిర్వర్తిస్తున్న బి.వీరన్నను ఇల్లెందు సబ్ పోస్టాఫీస్‌కు, ఖమ్మం మమతా హాస్పటల్ రోడ్ సబ్ పోస్టాఫీస్ నుంచి కెకె.శ్రీరాంను మధిర సబ్ పోస్టాఫీస్‌కు, ఖమ్మం ఇండస్ట్రియల్ ఏరియా సబ్ పోస్టాఫీస్ నుంచి కె.పాపయ్యను పాల్వంచ సబ్ పోస్టాఫీస్‌కు కేటాయిస్తూ ఉత్తర్వులు అందజేశారు.